సాక్షి
వికారాబాద్
ఆదివారం । 17 । ఆగస్టు । 2025



సరదాల దందా!

వీకెండ్ సరదాల కోసం నిర్మించుకున్న ఫాంహౌస్‌లు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయి. 8లో▸



ముమ్మరంగా..

దౌల్తాబాద్‌లో మండలంలో వర్షాలు సమృద్ధిగా కురుస్తుండటంతో వ్యవసాయ పనులు జోరుగా సాగుతున్నాయి. 9లో▸



అప్రమత్తంగా ఉండాలి

సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బంట్వారం ఎస్‌ఐ విమల సూచించారు. 9లో▸



వైభవంగా..

కృష్ణాష్టమి వేడుకలను జిల్లా వ్యాప్తంగా శనివారం ఘనంగా జరిగాయి. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. చిన్నారులను కృష్ణుడు, గోపిక వేషధారణలో అందంగా ముస్తాబు చేశారు. పలు గ్రామాల్లో ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు.

– ధారూరు



ఉధృతంగా..

భారీ వర్షాల నేపథ్యంలో జిల్లాలోని వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పలు మార్గాల్లో వరద కారణంగా రాకపోకలు స్తంభించిపోయాయి. చెరువులు, ప్రాజెక్టులు నీటితో కళకళలాడుతున్నాయి. అలుగు పారుతున్న శివసాగర్ ప్రాజెక్టు కనువిందు చేస్తోంది.

– యాలాల



తిరంగా..

స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం కోట్‌పల్లి ప్రాజెక్టులో లైఫ్ గార్డ్స్,బోటింగ్ సిబ్బంది తిరంగా ర్యాలీ నిర్వహించారు. బోట్లలో జాతీయ జెండాలను పట్టుకొని దేశభక్తిని చాటారు. జేకేఎంఆర్ కోఆర్డినేటర్ రాములు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం సాగింది.

– ధారూరు

న్యూస్‌రీల్

వాజ్‌పేయి ఆశయాలు సాధిద్దాం



నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

అనంతగిరి: దివంగత ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు మాధవరెడ్డి అన్నారు. శనివారం వికారాబాద్‌లో వాజ్‌పేయి వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వాజ్‌పేయి దేశాభివృద్ధిలో తకంటూ ఒక ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని పేర్కొన్నారు. పార్టీ కోసం, దేశం కోసం ఆయన తన జీవితాన్ని త్యాగం చేశారని కొనియాడారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శివరాజు, వడ్ల నందు, సీనియర్ నాయకుడు పాండు గౌడ్, కేపీ రాజు, నరోత్తంరెడ్డి, రాజేందర్‌రెడ్డి, నందు, రాములు, శ్రీనివాస్‌రెడ్డి, రాజేందర్‌గౌడ్, విజయ్‌భాస్కర్‌రెడ్డి, చరణ్‌రెడ్డి, అమర్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ఏ దేశమేగినా..



సౌదీలో జాతీయ జెండాతో ఇసాక్

పరిగి: పట్టణానికి చెందిన ముస్లిం మత గురువు మహమూద్ ఇసాక్ అలీ దేశభక్తి చాటారు. ఇటీవల సౌదీ వెళ్లిన ఆయన ప్రస్తుతం మదీనే షరీఫ్‌లో ఉన్నారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం జాతీయ జెండాను ప్రదర్శించి, పరిగి ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. మాతృ భూమిపై మమకారానికి మించిన సంపద లేదన్నారు.

నేడు 'బాల గోకులం'

కొడంగల్: పట్టణంలోని కేశవ స్వామి ఆలయంలో ఆదివారం బాల గోకులం కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు మురహరి వశిష్ఠ తెలిపారు. ఉదయం పూజా కార్యక్రమాలు, సాయంత్రం నాలుగు గంటలకు బాలగోకులం ,డోలారోహన మహోత్సవ కార్యక్రమం ఉంటుందన్నారు. ఐదేళ్ల లోపు చిన్నారులతో శ్రీ కృష్ణ వేషధారణ పోటీలు నిర్వహించి విజేతలైన 8 మందికి ఒక్కొక్కరికి 5 గ్రాముల చొప్పున వెండి బహుమతిగా ఇవ్వనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నూతన దంపతులకు ఎమ్మెల్యేల ఆశీర్వాదం



నూతన వధూవరులతో ఎమ్మెల్యేలు బీఎమ్మార్, టీఆర్ఆర్, కాలె

పరిగి: వికారాబాద్ ఎస్పీగా పనిచేసిన నారాయణ కూతురు వివాహం శనివారం నగరంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా ఎమ్మెల్యేలు టి.రామ్మోహన్‌రెడ్డి, కాలె యాదయ్య, బి.మనోహర్‌రెడ్డి, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డి మహేందర్‌రెడ్డి తదితరులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

నష్టం..అపారం

భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలు

- ఐదు వేల ఎకరాలకు పైగా వర్షార్పణం
- తూతూమంత్రంగా సర్వే
- పరిహారం కోసం ఏటా ఎదురుచూపులే..
- ఆదుకోవాలని అన్నదాతల వేడుకోలు



భారీ వర్షాలకు నవాబుపేట మండలంలో నీట మునిగిన పత్తి పంట

వికారాబాద్: ఎడతెరపిలేని వర్షాలకు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. వేల ఎకరాల్లో పంటలు పాడయ్యాయి. పత్తి, మొక్కజొన్న, వరి ఇతర పంటలు నీట మునిగిపోయాయి. వేలాది రూపాయల పెట్టుబడి నీటిపాలైందని రైతులు అంటున్నారు. ప్రకృతి వైపరిత్యాలకు ఏటా పంటలు దెబ్బతింటున్నా పరిహారం అందడం లేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లక్షల్లో పెట్టుబడులు పెట్టి ఎండనకా వాననకా కష్టపడి పండించి చేతికొచ్చే సమయానికి పంటలు వర్షార్పణమవుతున్నాయి. ఐదేళ్లుగా ఇదే పరిస్థితితో ఉందని పలువురు పేర్కొన్నారు. పంటలు దెబ్బతిన్న సమయంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు పర్యటించి ఆ తర్వాత మిన్నకుండిపోతున్నారనే విమర్శలు ఉన్నాయి. ఈ ఏడాది పంటల ప్రారంభ దశలోనే భారీ వర్షాలకు వేల ఎకరాల్లో నష్టం వాటిల్లింది. ఎకరాకు రూ.25 వేల పరిహారం అందించాలని ప్రతిపక్షాలు, రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఎప్పటిలాగే ఈ సారి కూడా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టాన్ని అంచనా వేస్తున్నారు.

వేల ఎకరాల్లో..

ప్రస్తుత సీజన్‌లో భారీ వర్షాల కారణంగా వేల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. అయితే అధికారులు ప్రభుత్వానికి పంపిన నివేదికలో మాత్రం వందల ఎకరాలే ఉన్నాయి. వ్యవసాయ శాఖ ఇచ్చిన నివేదిక ప్రకారం జిల్లాలో 283 మంది రైతులకు చెందిన 505 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు తేల్చారు. పరిగి, దోమ, పూడూరు, ధారూరు, తాండూరు మండలాల్లో ఎక్కువ నష్టం జరిగింది. బొంరాస్‌పేట, బషీరాబాద్, యాలాల, వికారాబాద్, నవాబుపేట మండలాల్లో కూడా నష్టం వాటిల్లింది.

పరిహారం కోసం పాట్లు

ఏటా పంటలు దెబ్బతింటున్నా ప్రభుత్వం నుంచి పరిహారం మాత్రం అందడం లేదు. ఐదేళ్లుగా ఇదే తంతు సాగుతోందని అన్నదాతలు ఆరోపిస్తున్నారు. ఐదేళ్లుగా ఇదే తంతు కొనసాగుతండుండటంతో రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గడిచిన ఐదేళ్ల కాలంలో 1.5 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతన్నియి. గతేడాది దెబ్బతిన్న 1,500 ఎకరాలకు మాత్రమే పరిహారం అందింది. 2023లో పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం ఇచ్చి ఆదుకోవాలని హైకోర్టు సైతం ప్రభుత్వాన్ని ఆదేశించింది. అయినా సాయం అందలేదు. ఇటీవల కురిసిన భారీ వర్షాలు చాలా వరకు పంటలు దెబ్బతిన్నాయని తమను ఆదుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.

ఐదేళ్లలో దెబ్బతిన్న పంటలు (ఎకరాల్లో)

2020	1.25 లక్షలు
2021	25 వేలు
2022	6వేలు
2023	3,399
2024	1,500
2025	5వేలు (సీజన్ ప్రారంభ దశలోనే..)



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క చిత్రంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తదితరులు

మహిళా సాధికారతకు కృషి

- పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క
- చించల్‌పేట్‌లో పలు అభివృద్ధి పనుల ప్రారంభం

నవాబుపేట: మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. శనివారం మండలంలోని చించల్‌పేట్ గ్రామంలో వివిధ అభివృద్ధి పనులను మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మండలి చీఫ్‌విప్ పట్నం మహేందర్ రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య తో కలిసి ప్రారంభించారు. గ్రామంలో రూ.15 లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని, రూ.20 లక్షలతో బీసీ కమ్యూనిటీ హాల్‌ను, రూ.20 లక్షలతో పశు వైద్య ఉపకేంద్ర భవనాన్ని, రూ.20 లక్షలతో నిర్మించిన డ్వాక్రా భవనం, రూ.30 లక్షలతో ఎస్సీ కమ్యూనిటీ హాల్, రూ.20 లక్షలతో పీహెచ్‌సీ భవనం, రూ.20 లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. మహిళల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో పథకాలు అమలు చేస్తోందన్నారు. ఉచిత బస్సు ప్రయాణం, వడ్డీ లేని రుణాలు, క్యాంటీన్లు ఏర్పాటు చేస్తోందన్నారు. మహిళా సంఘాలకు రూ.26 వేల కోట్ల రుణాలు ఇచ్చినట్లు తెలిపారు. మరో రూ.800 కోట్ల వడ్డీ లేకుండా ఇవ్వడం జరిగిందన్నారు. గృహలక్ష్మి పేరిట 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తున్నట్లు చెప్పారు. రేషన్ దుకాణాల్లో సన్న బియ్యాం పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.. చించల్‌పేట్ గ్రామంలో పెద్ద మొత్తంలో అభివృద్ధి పనులు ప్రారంభించుకోవడం అభినందనీయమన్నారు. మండలి చీఫ్‌విప్ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, ఆర్‌డీఓ వాసుచంద్ర, డీఆర్‌డీఏ శ్రీనివాస్, డీపీఓ జయసుధ, టీటీడబ్ల్యూఓ కమలాకర్ రెడ్డి, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి రాజరత్నం, పశుసంవర్ధక శాఖ అధికారి సదానందం, డీడబ్ల్యూఓ కృష్ణవేణి, పంచాయతీరాజ్ ఎస్ఈ శ్రీనివాస్‌రెడ్డి, ఈఈ ఉమేష్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రామ్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ గీతాసింగ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు

సీపీఐ మాటే తూటా

- ప్రజా సమస్యలపై గళం వినిపిస్తాం
- ప్రభుత్వ తప్పులను ఎండగడతాం
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

తాండూరు: ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్తంగా సీపీఐ పోరాటం చేస్తోందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శనివారం తాండూరు పట్టణంలోని సమద్ ఫంక్షన్ హాల్‌లో పార్టీ జిల్లా మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీతో స్నేహం కొనసాగుతుందన్నారు. అయినా ప్రభుత్వ తప్పులను ఎప్పటికప్పుడు ఎండగడుతున్నామని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి రాజీనామా చేయాలని అనలేమని తెలిపారు. ప్రజల ఆకలి బాధలు తీర్చేందుకు నిరంతరం పని చేస్తామన్నారు. ఆపరేషన్ కగార్‌ను వ్యతిరేకిస్తున్నట్లు స్పష్టం చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించే ప్రతి ఒక్కరూ కమ్యూనిస్టు లేనని అన్నారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగంలో అంటరానితనం పోవాలనే నినాదంతో పోరాటం చేశామని తెలిపారు. పార్టీ అనుబంధ కార్మిక సంఘాల ద్వారా కార్మికుల పక్షాన తాము గళం వినిపిస్తున్నామన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ సబ్‌ప్లాన్‌లను సక్రమంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలు, మున్సిపల్ కార్మికుల సమస్యలపై పోరాటం చేస్తామని చెప్పారు. విద్య రంగ సమస్యలపై అసెంబ్లీలో గళం విప్పాలని ఆ సంఘం నాయకులు సాంబశివరావుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పస్య పద్మ, జిల్లా కార్యదర్శులు విజయలక్ష్మి పండిత్, సీపీఐ నాయకులు గోపాల్‌రెడ్డి, పీర్ మహ్మద్, వెంకటేశ్, రవీందర్, సురేష్‌కుమార్, బషీర్ హైమద్, మునీర్ హైమద్, అబ్దుల్‌ల్లా, జగదాంబ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్లు పెంచుతావా.. గద్దె దిగుతావా?

- సీఎం రేవంత్‌రెడ్డిపై ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఫైర్
- పరిగిలో పింఛనుదారులతో సన్నాహక సమావేశం
- ఎన్నికల హామీలు అమలు చేయాలని డిమాండ్



పరిగి సమావేశంలో మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

పరిగి/తాండూరు: ఎన్నికల సమయంలో దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు ఇచ్చిన పెన్షన్ పెంపు హామీని అమలు చేస్తారా లేకుంటే గద్దె దిగుతారా అని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ సీఎం రేవంత్‌రెడ్డిపై ఫైర్ అయ్యారు. శనివారం పరిగి పట్టణంలోని శారద గార్డెన్‌లో, తాండూరు పట్టణంలోని గగ్రాణి ఫంక్షన్ హాల్‌లో ఎమ్మార్పీఎస్ నేతలతో కలిసి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా కార్యక్రమాల్లో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి వికలాంగులు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు ఇస్తున్న రూ.4 వేల పింఛన్‌ను రూ.6 వేలు, చేయూత పెన్షన్‌ను రూ.2 వేల నుంచి రూ.4 వేలకు పెంచుతామని హామీ ఇచ్చి విస్మరించారని మండిపడ్డారు. సెప్టెంబర్ 9న నగరంలోని ఎల్బీ స్టేడియంలో దివ్యాంగులతో భారీ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. పింఛన్ మొత్తం పెంచకుంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో ఏ విధంగా పెన్షన్‌లో ఇస్తున్నారో అదే తరహాలో ఇక్కడ కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో మాజీ సీఎం కేసీఆర్‌ను ఎలా గద్దె దించామో, సీఎం రేవంత్‌రెడ్డిని సైతం అలా దించాల్సి వస్తుందని హెచ్చరించారు. పరిగి కార్యక్రమంలో దివ్యాంగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్యాంప్రసాద్, మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పి.ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. తాండూరు కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్ మాదిగ, ఎంఎస్‌పీ జిల్లా ఉపాధ్యక్షులు నర్సింహులు మాదిగ, బి.కృష్ణ మాదిగ, నాయకులు మెట్లి సూర్యప్రకాష్ మాదిగ, ఉమాశంకర్ మాదిగ, ఆనంద్‌కుమార్ మాదిగ, వికలాంగుల హక్కుల పోరాట సమితి నాయకులు చందు, సుందర్, రాజు, గజ్జలప్ప, బలరామ్, రవి,అనిల్, పరశురాం స్వామిదాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి



సుధాకర్‌రెడ్డిని సన్మానిస్తున్న ఆలయ చైర్మన్

కుల్కచర్ల: ప్రజలంతా ఆధ్యాత్మిక చింతను అలవర్చుకోవాలని జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్ సుధాకర్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని పాంబండ రామలింగేశ్వరాలయాన్ని శనివారం ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకం నిర్వహించారు. ఆలయ అర్చకులు పాండుశర్మ మంత్రోచ్చారణలతో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ కోట్ల మహిపాల్‌రెడ్డి ఆయనను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు, ఆలయ పూజారులు పాల్గొన్నారు.

ఒడిశా టు మహారాష్ట్ర

- గుట్టుగా గంజాయి అక్రమ రవాణా
- రోడ్డు ప్రమాదంతో బయటపడిన 16.50 కిలోలు

అబ్దుల్లాపూర్‌మెట్: ఒడిశా నుంచి మహారాష్ట్రకు కారులో గంజాయి తరలిస్తున్న వ్యక్తి పోలీసులకు చిక్కాడు. అతని నుంచి 16.50కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. ఈ సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాటసింగారం శివారులో విజయవాడ జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి ఓ కారు డివైడర్‌ను ఢీ కొట్టిందన్న సమాచారం మేరకు అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కారులో ప్రయాణిస్తున్న వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించడంతో కారును తనిఖీ చేశారు. కొన్ని టేపుతో చుట్టి ప్యాక్ చేసిన ప్లాస్టిక్ కవర్ల మూటలు కనిపించగా వాటిని పరిశీలించడంతో గంజాయి అని తేలింది. దీంతో అతన్ని అదుపులోకి తీసుకుని విచారించగా ఖమ్మం జిల్లా వాస్రం తండాకు చెందిన భుక్యా మధుగా వెల్లడించాడు. తనకు ఖమ్మం జిల్లాకు చెందిన సాదిబ్ అనే వ్యక్తి స్నేహితుడని, ఒడిశా నుంచి మహారాష్ట్రకు గంజాయి సరఫరా చేస్తే రూ.50వేలు ఇస్తారని చెప్పడంతో అంగీకరించినట్టు తెలిపాడు. రాజమండ్రిలో ఓ గుర్తు తెలియని వ్యక్తి ద్వారా గంజాయి తీసుకుని హైదరాబాద్ మీదుగా మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌కు సరఫరా చేయాలని సూచించి రూ.50వేలు ఇచ్చినట్లు పేర్కొన్నాడు. ఈ క్రమంలో గంజాయి తరలిస్తుండగా మధు ప్రయాణిస్తున్న కారు బాటసింగారం వద్దకు రాగానే అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టి నిలిచిపోయింది. స్థానికుల సమాచారం మేరకు వెళ్లిన పోలీసులకు గంజాయి దొరికింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మధును అదుపులోకి తీసుకుని అతని నుంచి గంజాయిని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

క్లుప్తంగా

సెప్టెంబర్ 1 పెన్షన్ విద్రోహ దినం

అనంతగిరి: సెప్టెంబర్ 1న సీపీఎస్ రద్దుకు పీఆర్టీయూటీఎస్ ఆధ్వర్యంలో హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద తలపెట్టిన మహాధర్నా కార్యక్రమానికి ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కడియాల చంద్ర శేఖర్ పిలుపునిచ్చారు. వికారాబాద్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సీపీఎస్ రద్దు వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఐక్యంగా పోరాటం చేసి సాధించుకోవాలన్నారు.

మున్సిపల్ కమిషనర్‌పై విచారణకు ఆదేశం

మొయినాబాద్: వార్డు కార్యాలయాల వద్ద జాతీయ జెండా ఎగురవేసే విషయంలో మున్సిపల్ కమిషనర్ ఖాజా మొయిజుద్దీన్ వ్యవహరించిన తీరుపై కలెక్టర్ నారాయణరెడ్డి స్పందించారు. దీనిపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని శనివారం చేవెళ్ల ఆర్డీఓ చంద్రకళ, మొయినాబాద్ తహసీల్దార్ గౌతమ్‌కుమార్‌ను ఆదేశించారు. ఈ విషయమై వారు విచారించగా కొత్తగా ఏర్పడిన చేవెళ్ల, శంకర్‌పల్లి మున్సిపాలిటీ కార్యాలయాల్లోనే జాతీయ జెండా ఎగురవేసినట్లు తెలిసింది. వార్డు కార్యాలయాల్లో జెండా ఆవిష్కరణలో విషయంలో అక్కడి మున్సిపల్ కమిషనర్లు ప్రజలతో సమయస్ఫూర్తితో సానుకూలంగా మాట్లాడారని, మొయినాబాద్ కమిషనర్ ఖాజా మొయిజుద్దీన్ మాత్రం స్థానికులతో దురుసుగా మాట్లాడటం వివాదంగా మారినట్లు గుర్తించారు. ఇదే విషయాన్ని కలెక్టర్‌కు నివేదించినట్లు సమాచారం. ఈ విషయంలో కలెక్టర్ ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

రాహుల్ గాంధీకి మద్దతు తెలపాలి



కొవ్వొత్తులతో కాంగ్రెస్ నేతల ర్యాలీ

శంకర్‌పల్లి: ఓటు చోరీపై రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటానికి మద్దతు తెలపాలని కాంగ్రెస్ నేతలు పిలుపునిచ్చారు. ఏఐసీసీ, టీపీసీసీ పిలుపు మేరకు శనివారం పట్టణంలో కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టారు. కార్యక్రమానికి పార్టీ జిల్లా ఇన్‌చార్జి ఇంద్రసేనారెడ్డి, అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, మహిళా అధ్యక్షురాలు జ్యోతి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఓటు అనేది రాజ్యాంగం కల్పించిన హక్కు అని, దానిని దుర్వినియోగం చేయడం అన్యాయమని అన్నారు. దీనిపై వెంటనే న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్లమెంట్ ఇన్‌చార్జి రామ్మోహన్, నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్, నాయకులు గౌరీ సతీశ్, వెంకటయ్య, చెన్నయ్య, నర్సింలు, శ్రీకాంత్ రెడ్డి, రమ్య, ప్రవీణ్, శ్రీనాథ్ పాల్గొన్నారు.

ఆమనగల్లు బంద్ వాయిదా

ఆమనగల్లు: మార్వాడీ వ్యాపారసంస్థలకు వ్యతిరేకంగా పట్టణంలో వివిధ వర్తక, వాణిజ్య సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 18న నిర్వహించ తలపెట్టిన బంద్ తాత్కాలికంగా వాయిదాపడింది. మార్వాడి గో బ్యాక్ అంటూ వర్తకులు ఇచ్చిన పిలుపు, మార్వాడీ వ్యాపారస్తులకు వ్యతిరేకంగా నిర్వహించ తలపెట్టిన ఒకరోజు బంద్ తీవ్ర చర్చనీయాంశంగా మారింది. మార్వాడీలకు వ్యతిరేకంగా రాష్ట్రంలో పలుచోట్ల నిరసనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో పట్టణంలో బంద్‌కు పిలుపునివ్వడం చర్చకు దారితీసింది. ఈ నేపథ్యంలో బంద్‌పై మార్వాడీ వ్యాపారస్తులు, స్థానిక వర్తకసంఘం నాయకుల మధ్య చర్చలు జరిగినట్లు తెలుస్తోంది. స్థానిక వ్యాపారుల డిమాండ్లకు మార్వాడీలు అంగీకరించినట్లు సమాచారం. మరో వైపు స్థానిక వర్తకసంఘం నాయకులను పోలీసులు పిలిపించి మాట్లాడారని, ఈ నేపథ్యంలో 18న తలపెట్టిన బంద్‌ను వాయిదా వేసుకున్నట్లు తెలుస్తోంది.

ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలి

ఏసీపీ శ్రీకాంత్‌గౌడ్

శంషాబాద్ రూరల్: గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని ఏసీపీ శ్రీకాంత్‌గౌడ్ సూచించారు. శనివారం పెద్దషాపూర్‌లోని ఓ ఫంక్షన్ హాలులో వివిధ గ్రామాలకు చెందిన గణేష్ మండప నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఉత్సవాల సమయంలో తీసుకునే జాగ్రత్తలు, పాటించాల్సిన నిబంధనలను తెలియజేశారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ కె.నరేందర్‌రెడ్డి, పాల్గొన్నారు.

సరదాల దందా!

వీకెండ్ సరదాలకోసం నిర్మించుకున్న ఫాంహౌస్‌లు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయి. బర్త్‌డే పార్టీలు, సరదా పార్టీలు, మందు పార్టీలు, రేవ్ పార్టీలు, ముజ్రా పార్టీలతోపాటు వ్యభిచారం వంటి గలీజు దందాలకు నిలయాలుగా తయారయ్యాయి. ఎస్‌ఓటీ పోలీసులు తరచూ దాడిచేసి గుట్టు రట్టుచేస్తున్నా అడ్డుకట్ట మాత్రం పడడం లేదు.

- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా ఫాంహౌస్‌లు
- పార్టీల పేరుతో గంజాయి, హుక్కా, మద్యం వినియోగం
- యథేచ్ఛగా పేకాట, కోడి పందేలు, ముజ్రా పార్టీలు
- అద్దెకు తీసుకుని గుట్టుగా నడుపుతున్న నిర్వాహకులు
- తరచూ వెలుగు చూస్తున్నా పడని అడ్డుకట్ట



మొయినాబాద్ మండలం బాకారం రెవెన్యూలో విదేశీయులు బర్త్‌డే పార్టీ నిర్వహించిన ఫాంహౌస్

మొయినాబాద్: నగర శివారులోని మొయినాబాద్, చేవెళ్ల, శంకర్‌పల్లి, శంషాబాద్, మహేశ్వరం, ఇబ్రహీంపట్నం తదితర ప్రాంతాల్లో చాలా మంది ఫాంహౌస్‌లు నిర్మించుకుంటున్నారు. ఒక్క మొయినాబాద్ మండలంలోనే సుమారు వెయ్యికిపైగా ఉన్నాయి. చాలా మంది 10 గుంటల నుంచి ఎకరం వరకు భూమి కొనుగోలు చేసి అందులో ఫాంహౌస్ నిర్మిస్తున్నారు. వీకెండ్స్‌లో పిల్లలతో వచ్చి ఆనందంగా గడపడానికంటూ నిర్మించి తరువాత వాటిని లీజుకు, అద్దెకు ఇస్తున్నారు.

అద్దెకు తీసుకుని అడ్డగోలుగా..

లీజుకు తీసుకుంటున్న నిర్వాహకులు వాటిలో అడ్డగోలు దందాలు చేస్తున్నారు. గెట్‌టుగెదర్ పార్టీలు, ఫ్యామిలీ పార్టీలు, బర్త్‌డేలు అంటూ రోజువారీగా అద్దెకు ఇస్తున్నారు. వీటితోపాటు రేవ్ పార్టీలు, ముజ్రా పార్టీలు, పేకాట, కోడి పందేలు సైతం నిర్వహిస్తున్నారు. యువకులను ఆకర్షించేలా ఇతర ప్రాంతాల నుంచి అమ్మాయిలను తీసుకొచ్చి వ్యభిచారం సైతం చేయిస్తున్నట్లు గతంలో జరిగిన కొన్ని సంఘటనలు బయటపెట్టాయి. పార్టీల్లో అక్రమంగా మద్యం తాగడం, హుక్కా, గంజాయి, డ్రగ్స్ వినియోగం జరుగుతోంది.

కేసులు పెడుతున్నా మారని తీరు

ఎస్‌ఓటీ పోలీసులు తరచూ దాడులు చేసి పార్టీలను భగ్నం చేస్తున్నారు. అనుమతి లేకుండా పార్టీలు నిర్వహించేవారిపై కేసులు నమోదు చేస్తున్నారు. ఫాంహౌస్‌ల యజమానులు, నిర్వాహకులపై సైతం కేసులు పెడుతున్నారు. అయినా దందాలు మాత్రం ఆగడంలేదు. మామూళ్ల మత్తులో స్థానిక పోలీసులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

వెలుగుచూసిన కొన్ని ఘటనలు

- ఏడాదిన్నర క్రితం కనకమామిడి రెవెన్యూలోని ఓ ఫాంహౌస్‌లో వ్యభిచారం నిర్వహిస్తున్న ఇద్దరు నిర్వాహకులు, ఇద్దరు వ్యక్తులు, ఇద్దరు మహిళలను ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు.
- ఏడాది క్రితం నజీబ్‌నగర్ రెవెన్యూలోని ఓ ఫాంహౌస్‌లో ముజ్రా పార్టీ నిర్వహిస్తుండగా ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేశారు. నిర్వాహకులతోపాటు ఆరుగురు యువకులు, నలుగురు యువతులను పట్టుకున్నారు.
- ఏడాది క్రితం కనకమామిడి రెవెన్యూ పరిధిలోని ఓ ఫాంహౌస్‌లో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందుకున్న ఎస్‌ఓటీ పోలీసులు ఫాంహౌస్‌పై దాడి చేశారు. ఇద్దరు నిర్వాహకులు, నలుగురు విటులు, ముగ్గురు మహిళలను అదుపులోకి తీసుకున్నారు.
- ఆరు నెలల క్రితం అజీజ్‌నగర్ సమీపంలోని ఓ ఫాంహౌస్‌లో పేకాట స్థావరంపై ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేసి పేకాట రాయుళ్లను అరెస్టు చేశారు.
- ఆరు నెలల క్రితం తోలుకట్ట రెవెన్యూలో ఓ ఎమ్మెల్సీకి చెందిన ఫాంహౌస్‌లో కోడిపందేలు నిర్వహిస్తుండగా ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేసి భగ్నం చేశారు. నిర్వాహకుడితోపాటు 64 మందిని పట్టుకున్నారు. భారీగా మద్యం, నగదు, క్యాసినో కాయిన్స్, కోడికత్తులు, కార్లు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.
- నాలుగు నెలల క్రితం ఎత్‌బార్‌పల్లిలోని ఫాంహౌస్‌లో బర్త్‌డే పార్టీ పేరుతో నిర్వహిస్తున్న ముజ్రా పార్టీని ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేసి భగ్నం చేశారు. 13 మంది యువకులు, 7 మంది యువతులను పట్టుకున్నారు. వారి నుంచి గంజాయి, హుక్కా పాట్స్, మద్యం, నగదు స్వాధీనం చేసుకున్నారు.
- తాగాజా గురువారం రాత్రి బాకారంలోని ఓ ఫాంహౌస్‌లో అనుమతి లేకుండా మద్యం వినియోగిస్తూ బర్త్‌డే పార్టీ నిర్వహిస్తున్న 51 మంది విదేశీయులను ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. వారి నుంచి హుక్కా, 20 లీటర్ల విదేశీ మద్యం, 65 బీర్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు.

పోలీస్ డిటేన్ సెంటర్‌కు విదేశీయులు

అనుమతి లేకుండా ఫాంహౌస్‌లో బర్త్‌డే పార్టీ నిహించడంతోపాటు హుక్కా, విదేశీ మద్యం వినియోగించి పోలీసులకు పట్టుబడ్డ విదేశీయులను పోలీస్ డిటేన్ సెంటర్‌కు తరలించారు. బాకారం రెవెన్యూలోని ఎస్‌కే నేచర్ రీట్రీట్ ఫాంహౌస్‌లో గురువారం రాత్రి విదేశీయులు ఎలాంటి అనుమతి లేకుండా లిక్కర్ వినియోగిస్తూ నిర్వహించిన బర్త్‌డే పార్టీని ఎస్‌ఓటీ పోలీసులు భగ్నం చేసిన విషయం తెలిసిందే. ఇందులో పట్టుబడ్డ 51 మంది విదేశీయుల్లో 36 మందికి వీసాగడువు ముగిసినట్లు గుర్తించా రు. వారిని సొంత దేశాలకు పంపించే ఏర్పాట్లు చేస్తున్నారు. అప్పటి వరకు వారిని కోర్టు సూచ నతో పోలీస్ డిటేన్ సెంటర్‌లో ఉంచుతామని ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి కృష్ణస్వామి

- బలహీనవర్గాల అభ్యున్నతికి ఎంతగానో కృషి చేశారు
- ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు శ్రీశైలం ముదిరాజ్



పరిగిలో కొరివి కృష్ణస్వామి జయంతిని నిర్వహిస్తున్న ముదిరాజ్ సంఘం నేతలు

పరిగి: హైదరాబాద్ మాజీ మేయర్, రచయిత, జర్నలిస్ట్ కొరివి కృష్ణ స్వామిని ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు దోమ శ్రీశైలం ముదిరాజ్ అన్నారు. సంఘం నాయకులతో కలిసి శనివారం పట్టణంలో కృష్ణస్వామి జయంతి వేడుకలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నగరానికి తొలి మేయర్‌గా విధులు నిర్వర్తించిన కృష్ణస్వామి బహుముఖ ప్రజ్ఞాశాలి అని కొనియాడారు. బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఎంతగానో కృషిచేశారని తెలిపారు. ప్రతిఒక్కరూ ఆయనను ఆదర్శంగా తసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పరిగి మున్సిపల్ మాజీ చైర్మన్ అశోక్‌కుమార్ ముదిరాజ్, ముదిరాజ్ సంఘం తాలూకా గౌరవ అధ్యక్షుడు రామచంద్రయ్య ముదిరాజ్, కార్యదర్శి కృష్ణయ్య ముదిరాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మాణిక్యం ముదిరాజ్, రాష్ట్ర కార్యదర్శి ముకుంద నాగేశ్వర్ ముదిరాజ్, యూత్ అధ్యక్షుడు బాబయ్య ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



రాజాపూర్ వాగు పక్కన పత్తి పంటలో ఇసుక మేటలు

కన్నీటి వరద!

- భారీ వర్షాలతో కొట్టుకుపోయిన పంటలు
- పొలాల్లో ఇసుక మేటలు
- కన్నీటి పర్యంతమవుతున్న కర్షకులు

ధారూరు: మండల పరిధిలోని మోమిన్‌కలాన్ క్లస్టర్ పరిధిలోని భారీగా పంట నష్టం వాటిల్లిందని వ్యవసాయ విస్తరణ అధికారి మల్లేశం తెలిపారు. శనివారం ఆయన వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు తమ గోడు వెలిబుచ్చారు. పంటలు పూర్తిగా పాడయ్యాయని కన్నీటి పర్యంతమయ్యారు. 21 ఎకరాల్లో పసుపు, 113 ఎకరాల్లో పత్తి, 63 ఎకరాల్లో మొక్కజొన్న, 72 ఎకరాల్లో కంది పంటలకు నష్టం జరిగిందని ఏఈఓ తెలిపారు. మోమిన్‌కలాన్ కత్వ నుంచి పొలాల్లోకి భారీగా వరద రావడంతో ఇసుక మేటలు వేసి పత్తి పంటలు తుడిచిపోట్టుకుపోయాయన్నారు. ధారూరు క్లస్టర్‌లో 18 ఎకరాల పత్తి, 5 ఎకరాల వరి, 7ఎకరాల పెసర పంటలకు నష్టం వాటిల్లిందని ఏఈఓ సంతోష్ తెలిపారు.



మోమిన్‌కలాన్‌లో వాగు ప్రవాహానికి కొట్టుకుపోయిన పత్తి పంట

పిచ్చి కుక్క వీర విహారం

- ఆరుగురిని గాయపర్చిన శునకం
- ఒకరి పరిస్థితి విషమం

బషీరాబాద్: మండల కేంద్రంలో ఓ పిచ్చి కుక్క నాలుగు రోజులుగా స్వైర విహారం చేసింది. అడ్డొచ్చిన వారిపై దాడి చేసి కరిచింది. శనివారం ఇందిరా నగర్‌లో ఇంటి ఎదుట ఆడుకుంటున్న విక్రాంత్(4), నరేష్(8)తో పాటు ఆసియా బేగం(22)ను విచక్షణా రహితంగా కరిచింది. ఆసియా బేగంకు తొడ, చేతి వేళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆమెను తాండూరు జిల్లా ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషయమంగా ఉందని హైదరాబాద్‌కు రిఫర్ చేశారు. ఇదే శునకం నాలుగు రోజు క్రితం గౌరీ గల్లిలో స్వప్న అనే మహిళతో పాటు ఇద్దరు వృద్ధులను కరిచినట్లు స్థానికులు తెలిపారు. దీంతో శనివారం గ్రామస్తులు కుక్కను కొట్టి చంపారు. అధికారులు స్పందించి కుక్కల బెడదను నివారించాలని కోరుతున్నారు.



కుక్క కరవడంతో తీవ్ర గాయాలపాలైన ఆసియా బేగం



నరేష్ చేతికి కుక్క కాటు



కుక్క దాడిలో గాయపడిన విక్రాంత్

దూసుకొచ్చిన మృత్యువు

- ఆగి ఉన్న వ్యక్తిని ఢీకొన్న లారీ
- అక్కడికక్కడే దుర్మరణం

అబ్దుల్లాపూర్‌మెట్: నిలబడి ఉన్న వ్యక్తిని వెనుక నుంచి అతి వేగంగా వచ్చిన ఓ లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఖమ్మం జిల్లా వైరా మండలం నెమలి గ్రామానికి చెందిన కమ్మపాటి కృపారక్షణ (32) కుటుంబసభ్యులతో కలిసి శుక్రవారం రాత్రి హైదరాబాద్ జీడిమెట్ల నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నూజివీడుకు ఆర్టీసీ బస్సులో వెళ్తున్నాడు. ఈ క్రమంలో వారు ప్రయాణిస్తున్న బస్సు అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాటసింగారం శివారులోని ఇండియన్ పెట్రోల్ బంక్ సమీపంలోకి రాగానే టైరు పంక్చర్ అయ్యింది. దీంతో బస్సు డ్రైవర్ టైరును పంక్చర్ చేయిస్తుండగా కృపారక్షణ పక్కన నిల్చుని ఉన్నాడు. అదే సమయంలో హైదరాబాద్ వైపు అతివేగంగా వచ్చిన ఓ లారీ అతన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో కృపారక్షణకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు.

భవన విజయం!

- దేశంలో ఎన్‌సీఆర్ తర్వాత మనదే ఖరీదైన నగరం
- విలాసవంతమైన ఇళ్ల కొనుగోళ్లకు పెరిగిన ఆసక్తి
- రూ.3 కోట్ల కంటే ఎక్కువ ధర గృహాల కొనుగోలు
- జనవరి–జూన్ మధ్య 30,553 యూనిట్ల అమ్మకం
- క్రెడాయ్– సీఆర్ఈ మ్యాట్రిక్స్ నివేదికలో వెల్లడి

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ స్థిరాస్తి రంగం ఖరీదైపోయింది. ఒకప్పుడు దేశంలోనే అందుబాటు ఇళ్ల ధరల మార్కెట్‌లో హైదరాబాద్ ముందు వరసలో నిలవగా.. ప్రస్తుతం నేషనల్ క్యాపిటల్ రీజియన్ (ఎన్‌సీఆర్) తర్వాత దేశంలోనే అత్యంత ఖరీదైన రెండో నగరంగా అభివృద్ధి చెందింది. ఆధునిక వసతులు, విలాసవంతమైన జీవన శైలి, కొనుగోలుదారుల అభిరుచుల్లో మార్పులు, నిర్మాణ వ్యయాలు, భూములు, నిర్మాణ సామగ్రి ధరల పెరుగుదల వంటివి నగరంలో ఇళ్ల ధరల పెరుగుదలకు ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి.

లగ్జరీదే మూడో వంతు వాటా..

నగరంలో ఇళ్ల అమ్మకాల్లో విలాసవంతమైన గృహాలే ఆధిపత్యం చెలాయిస్తున్నాయి. ఈ ఏడాది తొలి అర్ధభాగంలో మొత్తం విక్రయాలలో రూ.3 కోట్ల కంటే ఎక్కువ ధర ఉన్న ఆస్తుల వాటా మూడో వంతు కంటే ఎక్కువగా ఉండటమే ఇందుకు ఉదాహరణ. క్రెడాయ్, సీఆర్ఈ మ్యాట్రిక్స్ తాజా గణాంకాల ప్రకారం.. జనవరి–జూన్ మధ్య కాలంలో నగరంలో రూ.56,345 కోట్ల విలువైన 30,553 ఇళ్ల విక్రయాలు జరిగాయి. ఇందులో రూ.3 కోట్ల కంటే ఎక్కువ ధర ఉన్న గృహాల విలువలో 35 శాతం వాటాను కలిగి ఉన్నాయి. రూ.1.5 కోట్ల నుంచి రూ.3 కోట్ల మధ్య ధర ఉన్న ప్రీమియం ఫ్లాట్ల వాటా మరో 34 శాతంగా ఉంది.

ధర ఏడాదిలో రూ.20 లక్షల పెరుగుదల..

కరోనా మహమ్మారి తర్వాత నగరంలో లగ్జరీ గృహాల మార్కెట్ పూర్తిగా మారిపోయింది. ఒక రకంగా చెప్పాలంటే కోవిడ్ లగ్జరీ ప్రాపర్టీ విభాగానికి బూస్ట్ లాగా మారింది. దీంతో నగరంలో ఏటా గృహాల ధరలు శరవేగంగా పెరుగుతున్నాయి. సగటు టికెట్ పరిమాణం పరిశీలిస్తే.. 2024 ప్రారంభంలో రూ.1.62 కోట్లుగా ఉండగా.. ఇప్పుడది ఏకంగా రూ.1.84 కోట్లకు చేరుకుంది. ఏడాదిలో రూ.20 లక్షల వరకూ ధరలు పెరిగాయి. ఎన్‌సీఆర్ తర్వాత దేశంలో రెండో అత్యంత ఖరీదైన మార్కెట్‌గా హైదరాబాద్ అవతరించింది.

అందుబాటు ఇళ్ల కొరత..

నగరంలో సగటు కొనుగోలుదారుకు ఇంటి యాజమాన్యం అందుబాటులో ఉండటం లేదు. సరసమైన గృహాలు దాదాపు కనుమరుగయ్యాయి. రూ.70 లక్షల కంటే తక్కువ ధర ఉన్న ఫ్లాట్ల అమ్మకాల విలువలో కేవలం 3 శాతమే ఉండటమే ఉదాహరణ. ఇవి కూడా ఎక్కువగా ఇస్నాపూర్, ఆదిభట్ల, కిస్మత్‌పూర్, ఘట్‌కేసర్ వంటి శివారు ప్రాంతాల్లోనే కేంద్రీకృతమై ఉన్నాయి. నగరంలో అందుబాటు గృహాల కొరత తీవ్రంగా ఉంది. చాలా మంది కొనుగోలుదారులు కార్యాలయాలు, పాఠశాలలు, ఆసుపత్రులు వంటి సౌకర్యాలకు సమీపంలో ఉన్న లగ్జరీ గృహాల వైపు మొగ్గు చూపిస్తున్నారు. మాదాపూర్, హైటెక్ సిటీ వంటి పశ్చిమ హైదరాబాద్‌లో అపార్ట్‌మెంట్ కొనాలంటే చదరపు అడుగు ధర కనిష్టంగా రూ.10వేలుగా ఉండగా.. ఇతర ప్రాంతాలలో రూ.8 వేలుగా ఉంది.

కూలీ మృతిపై కేసు నమోదు

కేశంపేట: విద్యుదాఘాతంతో కూలీ మృతి చెందిన ఘనటపై పోలీసులు కేసు నమోదు చేశారు. కేశంపేటలో నిర్మిస్తున్న పోశమ్మ దేవాలయ పనులు చేసేందుకు తమిళనాడుకు చెందిన రాజుకు కాంట్రాక్టుకు ఇచ్చారు. అతడి వద్ద అదే రాష్ట్రానికి చెందిన విజయబాలన్ కృష్ణన్ (45) కూలి పనులు చేసేందుకు వచ్చాడు. శుక్రవారం పనులు చేస్తుండగా దేవాలయం పక్కనే ఉన్న విద్యుత్ వైర్లు తగిలాయి. గమనించిన తోటి పనివారు చికిత్స నిమిత్తం కేశంపేట ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి షాద్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ విజయబాలన్ కృష్ణన్ మృతి చెందాడు. ఈ విషయమై శనివారం కాంట్రాక్టర్ రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



శివకుమార్ (ఫైల్)

కడ్తాల్: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన కడ్తాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ గంగాధర్ తెలిపిన వివరాలు.. మండల కేంద్రానికి చెందిన మారమోని శివకుమార్(21) స్థానిక వైన్స్‌లో పనిచేస్తున్నాడు. తలకొండపల్లి మండల కేంద్రానికి చెందిన బంధువు బోళ్ల మల్లేశ్ శుక్రవారం మైసిగండిలో నిర్వహించిన ఫంక్షన్‌లో శివకుమార్ పాల్గొన్నాడు. ఫంక్షన్ ముగిసిన అనంతరం అదే రాత్రి తలకొండపల్లిలోని బంధువుల ఇంటికి వారి వెంట తన బైక్‌పై బయలుదేరాడు. మార్గమధ్యలో చల్లంపల్లి సమీపంలో బైక్‌పై నుంచి కిందపడ్డాడు. తలకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు కడ్తాల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుడి సూచన మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా, యువకుడి నేత్రాలను కుటుంబసభ్యులు ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి అందజేశారు.

యువకుడి అదృశ్యం

కేశంపేట: యువకుడు అ దృశ్యమైన సంఘటన మండల పరిధిలోని కొండారెడ్డిపల్లి శివారులోని వాల్యతండాలో చోటుచేసుకుంది. పోలీసులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పుగడ్డతండా పంచాయతీ పరిధిలోని దేవునిగుడితండాకు చెందిన లక్ష్మణ్ భార్య, ముగ్గురు పిల్లలతో కలిసి కొండారెడ్డిపల్లి శివారులోని వాల్యతండాలో వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరి కుమారుడు ముడావత్ శ్రీనివాస్ చదువు మధ్యలో ఆపేసి వ్యవసాయ పనులు చేస్తూ ఇంటి వద్దే ఉంటున్నాడు. శుక్రవారం కుమారుడు ఇంటి వద్ద ఉండగా తల్లిదండ్రులు వ్యవసాయ పనులకు వెళ్లి మధ్యాహ్నం భోజనం కోసం ఇంటికి వచ్చారు. కుమారుడు కన్పించకపోవడంతో చుట్టపక్కల, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

మంత్రి సీతక్క

- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

చేవెళ్ల: అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రంలో ప్రభుత్వం ముందుకు సాగుతోందని పంచాయతీ రాజ్ శాఖమంత్రి సీతక్క అన్నారు. మండలంలోని పలు అభివృద్ధి పనులకు మండలి చీఫ్‌విప్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్యతో కలిసి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ముడిమ్యాల నుంచి మల్కాపూర్ గ్రామానికి రూ.3.35 కోట్లతో చేపట్టే బీటీరోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. మున్సిపల్ కేంద్రంలో రూ.1.30 కోట్లతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో మంత్రి మాట్లాడారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమాన్ని పేదలకు అందించటమే లక్ష్యంగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నట్లు చెప్పారు. ముడిమ్యాలలో మహిళలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందించి వారు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా దుకాణాలు పెట్టించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు సభ్యుడు చింపుల సత్యనారాయణరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్‌లు, నియోజకవర్గం నాయకులు, చేవెళ్ల ఆర్డీఓ చంద్రకళ, మున్సిపల్ కమిషనర్ వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠ పూజలు

మండలంలోని తంగడపల్లిలో నూతనంగా నిర్మించిన అభయాంజనేయస్వామి ఆలయంలో కొనసాగుతున్న విగ్రహప్రతిష్ఠ పూజలకు శనివారం మంత్రి సీతక్క, మండలి చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య హాజరయ్యారు.



గణపతులు రెడీ

వినాయక చవితి సమీపిస్తున్న తరుణంలో గణపతి ప్రతిమలు తుది మెరుగులు దిద్దుకుని పూజలకు సిద్ధమవుతున్నాయి. ధూల్‌పేట, హిమాయత్ నగర్ తదితర ప్రాంతాల్లో వినాయక విగ్రహాలను కళాకారులు తయారు చేశారు. నగరంలోని పలుచోట్ల విగ్రహాల విక్రయాలు ఇప్పుడిప్పుడే ఊపందుకుంటున్నాయి.

